# మిత్రమా ! ఓ మిత్రమా !

- పాలకోడేటి సత్యనారాయణ రావు

"**చూ**శారా సార్ " ?

- ఆ ప్రశ్న వినబడి అటుకేసి చూశాను. ఉలిక్కిపడ్డాను ! వాడే !!

"చూడలేదు .." అన్నాను వెంటనే,

"చూస్తానన్నారుగద్సార్..."

"చూస్తాలేవయ్యా ..ః"

కొంచెం చూడండి సార్, ప్లీజ్..."

-నేను కదిలాను, ఆలోచిస్తూ

అనుకోకుండా తగులుకున్న పాశమిది. ఆరోజు లక్డీకాపూల్ లో నడుస్తోంటే, పక్కనే ఎవరో దగ్గర్నుంచే నడిచినట్లుగా అనిపించింది. అటు దృష్టి మరల్చాను. అతని వయసు పదిహేను - ఇరవైల మధ్య ఉంటాయేమో ... బాగా నలిగిన బట్టలు ...బాగా పెరిగిన జుట్టు ... ఇంక వేరే పరిచయం అఖ్ఖర్లేదు నాకు - ఈ దేశంలో ముష్టి వాళ్ళ సంఖ్య పెరిగిపోతోందనటానికి ఇదే నిదర్శనం.. మనిషి ప్రక్కనే మనిషి .. నాప్రక్కనే వాడు !

"సార్ ...కొంచెం ఏమైనా ...." వృత్తికి కొత్తకాబోలు, ఇంకా ఏం మాట్లాడాలో తెలియని స్థితిలో ఉన్నాడు.

"దుక్కలాఉన్నావ్ ....ఏమైనా పని చేసుకు చావరాదూ !" అన్నాను కోపంగా, చిరాగ్గా !

"పోనీ, ఏదైనా పనైనా ఇప్పించండి సార్, చేస్తాను.." అన్నాడు గుండెల్లో రాయిపడింది... ఏమంటున్నాడు... పని ఇప్పించాలా ... ఏంపని ? నేనెలా ఇప్పిస్తాను ... ? ప్రభుత్వం వారే పనులు లేవని చెప్పేస్తోంది .. అలాటి క్లిష్టపరిస్థితిలో దేశం ఉన్నప్పుడు నేను .. ఆఫ్టరాల్ - ఓ సాధారణ పౌరుడిని .. నేను ఇప్పించగలనా పని .. ?

" ఏపనైనా పర్వాలేదు సార్ .. చేస్తాను .." అన్నాడు మళ్లీ.

- నేనెలా ఇప్పించగలను పని ... ఎవరికి వారు తమకు తగ్గపనిని తామే చూసుకోవాలి. సెల్ఫ్ సర్వీస్ ... ఆ సంగతి వీడికి తెలీదా ?

"... నువ్వు చూసుకోవాలి నీపని ..." అన్నాను చాలా విసుగ్గా ... నడిరోడ్డుమీద వీడితో మాట్లాడటం నాకు చాలా చిన్నతనంగా ఉంది .. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు .. ఏదో క్లోజ్ ఫ్రెండ్‌లా, పక్కపక్కనే నడుచుకుంటూ మాటలు పంచుకొంటున్నాం... ఈ పేవ్‌మెంట్ మీద కలిసే నడుస్తున్నాం.... పొరబాటున ఎవరైనా వీడిని నాఫ్రెండ్ అనుకొంటే .. ఎంత చిన్నదనం...

... చాలా ట్రైచేశాను సార్ ... దొరకలేదు.. మీరేమైనా ఇప్పించండి సార్.."

"-సర్లే .. చూస్తాలే .. వెళ్లు .." తప్పించుకోవాలని అన్నాను... కానీ, ఇరుక్కుపోయానని ఆ క్షణంలో తెలీలేదునాకు .. ఆతర్వాత రెండు రోజులకు .. అదే రోడ్డుమీద నడుస్తోంటే మళ్లీ కనబడ్డాడు ...

"నమస్తే సార్ ..." నవ్వుతూ పలకరించాడు. దిమ్మెరపోయాను నేను - ఏంటిది, ఏదో పరిచయస్థుడిలా పలకరిస్తున్నాడు...

"సార్ ... ఉద్యోగం చూస్తానన్నారు ..."

ఏంటిది ... పనిలోంచి 'ఉద్యోగం' లోకి వెళ్ళిపోయాడు ! 'పని' అంటే గంటో, అరగంటో చేసేది. 'ఉద్యోగం' అంటే నిత్యం,, ప్రతిరోజూ జీవితాంతం చేసేది .. గంటో అరగంటో చేసే పనికే దిక్కులేదు, ఇంక నిత్యం చేసే ఉద్యోగం ఎక్కడ ఇప్పించగలనా వీడికి ... !

"చూస్తానన్నా గదా " ...

" ప్లీజ్ ... కొంచెం చూడండి సార్ .. "

-ఇలాటి వాళ్లూ ఉంటారా అనిపించింది నాకు ! రోడ్డుమీదకు వస్తే చాలు, సవాలక్షమంది ముష్టాళ్లు మనచుట్టూ మూగుతుంటారు. పావలాయో, అర్థో అడిగే వాళ్లు కొందరైతే; బస్ టిక్కెట్‌కు డబ్బులు సరిపోవటం లేదంటూ డబ్బులు అడిగే వాళ్లు ఇంకొందరు, మరికొందరు ఉంటారు - వాళ్ల చేతిలో ఓ పసిగుడ్డు కూడా ఉంటుంది, ఓ చిన్న కాగితాన్ని పట్టుకొని ' ఈ మందుకొనాలి .. అయిదురూపాయలు ఇవ్వండి సార్ .. " అంటూ స్టయిల్‌గా అడుక్కొంటూ ఉంటారు.

-అసలు ఎవరు వీళ్లు ... ఎక్కడి నుంచి వస్తారు ? వీళ్లంతా పెరిగి పోయిన మన జనాభాకు మచ్చు తునకలా ? విరిగిపోతున్న మన ఆర్థిక వ్యవస్థకు అద్దాలా?

మహారచయితలు, రచయిత్రులు నవలల్లో చిత్రించే ప్రేమకు నిజజీవితంలో అనుభవించే ప్రేమకు ఎప్పుడూ సంబంధముండదు - హాలెల్స్

కాకపోతే, నమ్మిన చేతివృత్తులు అన్నీ మల్టీ నేషనల్ వ్యాపార సంస్కృతులకు బలి అయిపోయి, దిక్కు తోచక రెక్కలు విరిగిపోయి ఇలా ఈ జాలిలేని పట్నం మీద వాలే గ్రామీణ పక్షులలా ఇవన్నీ ?? కాకపోతే, నేలను నెర్రలు విచ్చిపోతే, గుండెలు పగిలిపోతే, మేఘాల నుంచి పడని కారణ్యపు వర్షాలు కనీసం తోటి మనుషుల హృదయాలనుంచైనా జాలివానలైకురుస్తాయని ఆశించే పల్లెకారు చిన్నకారు రైతులా .. లేదా రైతుకుంటుంబ సభ్యులా ..

–ఎవరైనా కావచ్చు. ఎవరైనా వీళ్లు దైవోపహతులు. కొండంత కాదు, కొంత సాయం అర్థిస్తూ చేతులు జోడిస్తున్న వాళ్లు .. చేస్తే ఏం పోతుంది ...

చూద్దాం .... ఇతనకి పని ఇప్పించగలనేమో... నోటినుంచి యథాలాపంగా వచ్చిన మాటలకు ఎంతో కొంత మహత్తు ఉంటుందేమో – లేకపోతే ఇదేమిటి, ఇలా ఓ ముష్టివాడి కోసం నేను ఉద్యోగం వేటలో పడటం...

ఎక్కడ మొదలు పెట్టాలి ?

ఎవర్ని అడగాలి ??

'చారిటీ బిగిన్స్ ఎట్ హోమ్ ..' అంటారు. ఇంట్లోనే ఆరంభిద్దాం, అనుకున్నాను.

మనసు తెలిసిన శ్రీమతి ఉండటం ఎవరికైనా అదృష్టమే. పర్వాలేదు, చాలామంది భార్యా భర్తల్లాకాదు, మేం అన్యోన్యంగానే ఉంటాం.. మనసులో ఆలోచనలు, భావనలు మనసుల్లోనే ఉంచేసుకోక, మేం వాటినీ పంచుకొంటాం... ఆపనే చేశాను నేను.

జీవితంలోనన్నా మొదటి సారి చూస్తున్నంత కొత్తగా, వింతగా చూసింది శ్రీమతి " మీకైనా పిచ్చా, వెర్రా ?" అంది ఆఖరికి !

"చదివేస్తే ఉన్నమతి పోయిందంటారో, అలా ఉంది మీపని " ! అంది.

''రోడ్డుమీద ముష్టాడికి ఇంట్లో ఉద్యోగం ఇస్తారట..కట్టుకొన్న పెళ్లానికి ఇప్పించ లేరు గానీ .. రోడ్డుమీద ముష్టాడికి..." అంది.

" చేతిలోంచి ఓ అర్థరూపాయో, జేబులోంచి ఓ రూపాయో ఇచ్చి వదిలించుకోవాలి గానీ ... ఇలా ఇంటికి తీసుకొస్తారా ఎవరైనా ... తెలివి అంటే ఇదే కాబోలు !" అంది.

ఇంకా చాలా చాలా అంటూనే ఉంది ఆరోజుంతా.. అవన్నీ అనవసరం .. అయితే ఒక్క విషయం ఒప్పుకోవాలి. శ్రీ'మతి' కావటంతో ఓ అయిడియా కూడా ఇచ్చింది.

దాన్ని ఆ రోజే అమలులో పెట్టేశాను .. అనుకొన్నట్లే అదేచోట మళ్లీ కనపడగానే – అప్పటికే సిద్ధంగా ఉంచుకొన్న అయిదు రూపాయల నోటు ఇచ్చాను .. "ఇది ఉంచుకో .. ఎక్కడైనా పని చూసుకో !" అన్నాను.

" వద్దుసార్ .. ఇదొద్దు .. పని చూపించండి సార్.." అన్నాడు !

– ఆరోజు ఏం ముహూర్తమో ఏమో.. నాకు దుర్ముహూర్తం అవుతోంది.. వీడిని వదిలించు కోవటం వీలుపడటం లేదు .. ఏం ఖర్మమో !

ఏం అని ఉంటాను ఆరోజు .. ఆలోచించాను .. ఏమో, గుర్తురావటం లేదు !

పని ఇప్పిస్తే గానీ వదలను అంటున్నాడు .. అనటం లేదు గానీ ఆవిషయం నాకు అర్థమయ్యేలా చేస్తున్నాడు .. అసలు ఇలాటి ఓ అడ్రస్ లేని వాళ్లకు ఎవరిస్తారు ఉద్యోగం .. ? వీళ్లకు అడ్రసే కాదు, ఏదీలేదు .. తల దాచుకోవటానికి గూడు, కడుపు నింపుకోవటానికి కూడు, ఒళ్లు దాచుకోవటానికి గుడ్డ .. ఏమీలేవు. అసలు వీళ్లెలా బతుకుతున్నారో ఏమో ..

ఆ మర్నాడు తెలిసింది నాకు .. ఆపేవ్‌మెంట్ మీదే ఓ బట్టల కొట్టు ముందు పడుకొంటాడట రోజూ.. అదే తన అడ్రస్ అన్నాడు .. ' సార్ .. చూస్తానన్నారు గదా" ! అనీ అన్నాడు చివరికి !

"చూస్తాలేవయ్యా !" అన్నాను. ఇలా అంటున్నది అతను వాగ్దానం అనుకుంటున్నాడేమో .. చూస్తాలేవయ్యా అంటే ప్రయత్నించి చూస్తానని కదా అర్థం ... ఏం అర్థం చేసుకుంటున్నాడో ఏమో ....! ఎలాగైనా వీడ్ని వదిలించుకోవాలి. అది తప్పదు... ఉద్యోగం ఇప్పించో, ఇప్పించకుండానో...

– ఓ వారం పదిరోజుల తర్వాత రామకృష్ణను చూద్దానికి వెళ్లా.. నాతోబాటే చదువుకొన్నాడు. కానీ అదృష్టం కలిసి వచ్చి .. మంచిపోస్ట్‌లో ఉన్నాడు. ఉద్యోగాలు ఇప్పించేంత మంచి పోస్ట్.. ఆ మాటఈ మాట మాట్లాడాక, నెమ్మదిగా అన్నాను. " ఓ ఉద్యోగం ఇప్పించాలి ...!"

టేబుల్ మీద ఫైళ్ళు సర్దుకొంటూ అన్నాడు రామకృష్ణ 'సర్లే చూద్దాం' ఓ బయోడేటా తెచ్చిమ్మను ఆ కుర్రాడ్ని ..

మహాపురుషులు అకస్మాత్తుగా పైకి ఎదిగిపోలేదు. తమ తోటివారు నిద్రలో మునిగివుంటే వారు నిరంతరం తమ ధ్యేయప్రాప్తికై నిద్రాహారాలు మాని కృషి చేస్తారు.

అవునూ .. అబ్బాయా .. అమ్మాయా ? అమ్మాయి అయితే ఇప్పట్లో కుదరదు .. వాళ్లు పొద్దున్నే రాలేరు, లేటుగా ఉండలేరు .. పెద్ద ప్రాబ్లమ్ ..."

నాకాండిడేట్‌ది ఇంకా పెద్ద ప్రాబ్లమ్ అని ఎవరు చెప్తారు .. "అబ్బాయేలే .. ! " అంటూ నెమ్మదిగా అసలు సంగతి బయటపెట్టాను.

ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు రామకృష్ణ. చాలసేపటి తర్వాత అన్నాడు "నీ ఉద్దేశం బాగుంది కానీ అది జరిగేపనే అంటావా ? వాడు ఏం చదివాడో తెలీదు.. ఎక్కడ ఉంటాడో తెలీదు, ఎలాంటివాడో తెలీదు.. ఏం సెక్యూరిటీ ఉంటుంది చెప్పు కంపెనీకి .. ఎవడు రెస్పాన్సిబిలిటీ తీసుకొంటాడు అలాటి వాళ్లకు !.."

–రెస్పాన్సిబిలిటీ.. బాధ్యత .. ఎవరికి ఉంది వాళ్లగురించిన బాధ్యత .. ప్రజలకు లేదు, ప్రభుత్వానికి లేదు.. సమాజానికీ లేదు .. ఈ పిల్లి మెడలో ఎవ్వరూ గంట కట్టనే కట్టరు .. !

" నా మాట విను. నాతో అంటే అన్నావ్ గానీ, ఇంకెవరితోనూ అనకు ... ఎవ్వర్నీ ఉద్యోగం అతనికోసం అడక్కు ! నీకు పిచ్చి అనుకోగలరు.." అంటూ నా శ్రేయోభిలాషిగా రామకృష్ణ ఓ సలహాకూడా ఇచ్చేశాడు.

–వెనక్కు వచ్చేశాను, ఒట్టి చేతులతో ! ఇంట్లో శ్రీమతీ, వీధిలో హితుడూ ఒకేమాట చెప్తున్నారు... పోనీ వాళ్లమాటే వింటే పోతుందేమో– అందుకే ఆరోజు నుంచి... ఆఫీసుకు వెళ్లే దారిమార్చేశాను. చక్కని రాజమార్గముండగా, పక్కవీధులు పట్టాను... అన్నమాటను నిలబెట్టుకోలేని వీరుడిగా...

అయినా – ఆ రోజు ఏం అన్నానో .. సరిగ్గా గుర్తురావటం లేదు .. రోజూ ఆఫీసుకు బయలుదేరేటప్పుడు, వీధిలోకి రాగానే అతను గుర్తొస్తాడు. వెంటనే దారిమారుస్తాను.. ఎంతకాలం ఇలా తప్పించుకోగలను ..

–నా కోసం అతనూ వెతుకుతుంటాడేమో... దారిమార్చి ఉంటానని గుర్తించి, ఈ పక్కదారిలోకి వస్తే.. అదే జరిగితే –

ఆ క్షణంలో తల ఎత్తుకోగలనా నేను .. !!

–దానికన్నా ..

'ఇదిగో, గత ఆరు నెలల నుంచీ చూశానయ్యా.. నీకు ఉద్యోగం చూడలేకపోయా .. సారీ .. నా చేతకానిపని అది ! ఏమీ అనుకోకు .. అయాంసారీ ..' ఇలా ఓపెన్‌గా చెప్పేస్తే సరిపోతుంది. ఆ తర్వాత తలెత్తుకు తిరగ గలను.. వీలైతే ఎప్పుడో – ఓ ఉద్యోగం ఇప్పించ గలిగితే సరి .. లేకపోతే లేదు .. జీవితంలో ఎన్నెన్నో అనుభవాలు, వాటిలో ఇదొకటి. అంతే !!

ఇలా అనుకొన్నాక కొంచెం కుదుటపడ్డాను.. రేపు ఉదయం రేపు ఉదయం వెళ్లి నా నిస్సహాయత చెప్పేస్తే...ఇంకా తేరుకొంటాను !!

... మర్నాడు ఉదయం –

లక్డీకాపూల్ దగ్గర .. అదేచోట .. నేను అక్కడికి చేరేసరికి .. కొందరు వ్యక్తులు గుమిగూడి ఉన్నారు .. కొంతమంది పోలీసులు కూడా– భయం వేసింది.. ఏం జరిగి ఉంటుంది ?

–బట్టల కొట్టు ముందు పడుకొనే వీళ్లు, రాత్రి ఆ కొట్టుకు కన్నంవేసి ఉంటారు .. అంతే, అంతే ఉంటుంది! ఇప్పుడు నేను వెళ్తే .. ' ఆ సార్ నాకు తెలుసు.. ' అన్నాడంటే, ఎంత అవమానం.. కొంపమునిగి పోతుంది... ఇంక ఈ జన్మలో మళ్ళీ ఈ రోడ్డుమీద నడవలేను ...

–వెళ్లటమా ..? మానటమా ...?

దూరంగా నిలబడిపోయాను .. భయంగా – ఆదృశ్యాన్ని చూస్తూ ... అక్కడ పోలీసులు .. ఇంకొందరు కలిసి ... ఎవర్నో ఎత్తి ట్రాలీలో పడేస్తున్నారు .. గతుక్కుమంది గుండె .. ముందుకు నడిచాను ..

"ఏమయింది "? ఆత్రతగా అడిగాను.

" ఆ... ఎవడో బెగ్గర్ ... చలికి చచ్చిపోయాడు...!" ఎవరో జవాబు ఇచ్చారు.

మరో అడుగు వేశాను. ట్రాలీలోకి చూశాను.. అతనే !! ... నా ఫ్రెండ్ ..

"... ఏమైనా పని చేసుకు చావరాదూ.. !' ఇప్పుడు గుర్తొస్తోంది ఆరోజు ఏమన్నానో .. నేను అన్న పని నేను చేయలేకపోయాను. ప్రకృతో, కాలమో, వాతావరణమో, చలో, రెండోపని ... తనపని చేసుకుపోయింది.

–మనసంతా చెదిరి పోయింది...

రెండడుగులు వేసి – పేవ్‌మెంట్ మీద కూలబడ్డాను...

నాకళ్లమ్మట నీళ్లు ... ఆగకుండా వెక్కిళ్లు ...

మరొక క్రొత్తజన్మ ఎత్తటం కోసం విత్తనం ఇప్పుడు చచ్చిపుడుతుంది. మానవుడు కూడా అంతే - వాగ్దేవర్